క్లుప్తంగా

శీతల మాతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శీతలమాత

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ (శీతలమాత) అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ రజతోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారిని భక్తులు అమ్మవారికి సమర్పించిన రజిత వస్త్రాభరణాలకు సంప్రోక్షణ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి, సభ్యులు దేవరపు సుబ్బారావు, వేగి నాగేశ్వరరావు, లింగం రాంబాబు, వలవల హనుమ, శిరిగినీడి ఉమ తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గా కిషోర్

పాలకొల్లు సెంట్రల్: పది మందికి సేవ చేయాలనే తపన ఉన్న ఆ సేవ చేయడానికి అదృష్టం కూడా ఉండాలని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీ గాయత్రి స్మార్త పురోహిత సంఘం, లయన్స్ క్లబ్ సహకారంతో బ్రాహ్మణ కుటుంబ సభ్యులకు ఉచిత కంటి, దంత పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గా కిషోర్ మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబ సభ్యులకు వైద్య సహాయం అందించే అదృష్టం లయన్స్ క్లబ్ సభ్యులకు దక్కిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జయభారత రెడ్డి, ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

మందాలమ్మ సేవలో 'కోర్టు' చిత్ర నటుడు


వడలి మందాలమ్మ ఆలయంలో కోర్టు చిత్ర నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ కరుణతోనే ఇంతటి ఉన్నత స్థాయికి చేరుకున్నానని కోర్టు చిత్ర నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం వడలిలోని గ్రామ దేవత మందాలమ్మను దర్శించుకుని, అనంతరం కోర్టుచిత్ర టెక్నీషియన్, వడలికి చెందిన ఆచంట వెంకటేశ్వరరావుతో కలసి పెనుగొండ మినర్వా థియేటర్ వద్ద సందడి చేశారు. అనంతరం వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోగిరెడ్డి శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. మానవత అధ్యక్షుడు విజయరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పద్దాల వెంకమ్మ జాతర మహోత్సవాలు

వీరవాసరం: మండలంలోని నౌడూరు జంక్షన్‌లో ఉన్న పద్దాలవెంకమ్మ వారి 36వ జాతర మహోత్సవాలు ఈ నెల 29 నుంచి 30 వరకు నిర్వహిస్తామని ఆలయ నిర్మాత పెనుమత్స సూర్యనారాయణ రాజు గురువారం తెలిపారు. 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు అమ్మవార్ల జాతర మహోత్సవం గరగనృత్యాలతో, బాణసంచా కాల్పుల మధ్య అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అనంతరం అఖండ అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడతామన్నారు. భక్తులంతా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

మెగా జాబ్‌మేళాలో 325 మందికి ఉద్యోగాలు

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగాజాబ్ మేళాలో 325 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. జాబ్‌మేళాకు ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి సుమారు 1,800 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. జాబ్‌మేళాను ప్రారంభించిన కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగావకాశాల కోసం కంపెనీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ లోక్‌మాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ స్‌డీఓ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, ఎండీ సలీమ్‌ఖాన్, ఎస్.నిర్మల, వీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ వాసుల ఆకాంక్షలు నెరవేరేనా?


పెనుగొండ ఎల్లప్ప పంట కాలువ దుస్థితి


పెనుగొండలో ఓల్డ్ చానల్‌లో కలుస్తున్న పెనుగొండ గ్రామ మురుగు


సమస్యలతో సతమతమవుతున్న పెనుగొండలోని కాలనీలు

నేడు నిర్వహించే గ్రామసభపై అందరి దృష్టి

పెనుగొండ: పెనుగొండలో గురువారం నిర్వహించే గ్రామసభపై గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యల పరిష్కారం అవుతాయా? అంటూ ఆత్రుతగా చూస్తున్నారు. కుటుంబ మూలాలు ఉన్న గ్రామాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి పెడతానని ప్రకటించడంతో ఆయన పేషీ అధికారులు పెనుగొండ, మొగల్తూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. పెనుగొండలో మధ్యాహ్నం 3.30 గంటలకు టీటీడీ కల్యాణ మండపంలో గ్రామసభ నిర్వహిస్తారు. ముఖ్యంగా పెనుగొండ ప్రజలు డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. నానాటికి పెరిగిపోతున్న జనాభాతో ఎపుడో పూర్వం నిర్మించిన డ్రెయినేజీతో మురుగు పోయే మార్గం లేక పంటకాలువల్లోకే మురుగు వెళుతుంది. నిధుల లేమితో దీని పరిష్కారం వైపు అడుగు వేయడానికి ఎవరూ సాహసించడం లేదు. ఓల్డ్ చానల్, ఎల్లప్ప కాలువల్లోకే కాకుండా, ప్రధాన కాలువైన నరసాపురం కాలువలోకి పెనుగొండ మురుగు చేరుతుంది. దీంతో రైతులు అవస్థలకు గురవుతున్నారు. దీని పరిష్కారానికి 2012 ప్రాంతంలో భూగర్భ డ్రెయినేజీ ప్రతిపాదనలు వచ్చినా అటకెక్కింది. మరో సమస్య తాగునీటి సమస్య ఇటీవల కొత్తగా వచ్చిన కాలనీలకు తాగునీటి సమస్య దారుణంగా ఉంది. దీంతో పాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీల సమస్య అధికంగానే ఉంది,

డంపింగ్ యార్డుతోనూ ఇబ్బందులే

అరకొరగా ఉన్న డంపింగ్‌యార్డుతోనూ పంచాయతీ విమర్శలను ఎదుర్కొంటుంది. గతంలో డంపింగ్ యార్డు సరిపడగా ఉన్నా, పెరిగిన చెత్తా చెదారాలతో డంపింగ్‌యార్డు విస్తరింప చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. స్థల సేకరణకు నిధులు, స్థల లభ్యత అడ్డురావడంతో స్థానిక అధికారులు, పాలకవర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డులో వేసిన చెత్త వల్ల ప్రధాన మురుగు కాలువ నక్కల డ్రెయిన్ బక్కచిక్కి సన్నబడిపోతుందన్న విమర్శలు ఉన్నాయి. ఇలా ప్రధాన సమస్యలు అధికంగా ఉండడంతో వీటి పరిష్కారానికి ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆధ్యాత్మిక శోభ కోసం

ఆర్యవైశ్యులు ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి జన్మస్థలం పెనుగొండ. ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలపై దృష్టి పెట్టినట్లుగా, పెనుగొండపైనా దృష్టి సారించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. పెనుగొండ గ్రామానికి నలువైపులా ముఖద్వారాల ఏర్పాటు, ప్రధాన నరసాపురం కాలువ గట్టు పెనుగొండ సరిహద్దుల నుంచి సుందరీకరించి, అమ్మవారి చరిత్ర గోచరించే విధంగా సంఘటనాంశాలతో ప్రతిమలు ఏర్పాటు చేసి ట్రాక్‌గా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుకొంటున్నారు. అదేవిధంగా వాసవీ శాంతి ధాం వద్ద అధునాతనమైన బస్టాండు, కూడలి సుందరీకరణ చేసి పెనుగొండకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలని కోరుతున్నారు.

రేపు రోజువారీ పన్నుల వసూలుకు వేలం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లపై 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు శనివారం ఉదయం 11 గంటలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రూ 3 లక్షలు దరావత్తు చెల్లించి రూ 5 లక్షలు సాల్వెన్సీ చూపించి పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ నెల 24న ఓ సారి వేలం నిర్వహించగా, ఎవరూ పాల్గొనని కారణంగా వాయిదా పడింది.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

పెనుగొండ: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో నిజాయితీగా విచారణ జరపాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.తిమోతి రాజు, రాష్ట్ర సెక్రటరీ బి.డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆచంటలోని క్రీస్తు ప్రార్థనా మందిరంలో ఆచంట మండల పాస్టర్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి ప్రార్థన నిర్వహించారు. సమావేశంలో పీడబ్ల్యూఏ కమిటీ సభ్యులు పి.శేఖర్ బాబు, అధ్యక్షుడు ఐ.డేవిడ్ రాజు, కె.సువర్ణ రాజు, సెక్రటరీ పి.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

పెనుగొండ: మండలంలోని రామన్నపాలెంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ గురువారం అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నారు. అలాగే దక్షిణ హరిజనపేట పొలాల్లో పేకాడుతున్న తొమ్మిది మందిని పెనుగొండ ఎస్సై, వారి సిబ్బంది అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ.3,020 స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామానికి చెందిన తాళం రామకృష్ణ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో తాళం రామకృష్ణ వద్ద ఏడు మద్యం సీసాలు దొరకడంతో అతని పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామ రాజు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి


పెనుగొండలో వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పెనుగొండ: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఏళ్ల తరబడి కార్మికులు పని చేస్తున్నా ప్రభుత్వం టెండర్ పేరుతో కార్మికులకు సర్వీస్ లేకుండా చేస్తుందని విమర్శించారు. ఐదు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు ముఖం చాటేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా


యలమంచిలి మండల పరిషత్ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు

యలమంచిలి: యలమంచిలి ఎంపీపీ ఎన్నిక కార్యక్రమం గురువారం హాస్యాస్పదరీతిలో శుక్రవారానికి వాయిదా పడింది. మండలంలో మొత్తం 18 మంది సభ్యులకు గానూ కట్టుపాలెం ఎంపీటీసీ సభ్యుడి స్థానం ఖాళీగా ఉంది. మిగిలిన 17 మందిలో 13 మంది వైఎస్సార్ సీపీ వారు కాగా, ముగ్గురు తెలుగుదేశం, ఒకరు జనసేన పార్టీకి చెందిన వ్యక్తి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక 11 గంటలకు నిర్వహించాల్సి ఉండగా మొత్తం 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉదయం ఎనిమిది గంటలకే మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. అయితే అధికారులు మాత్రం సభ్యులను 10 గంటల 45 నిమిషాల వరకు సమావేశ మందిరంలోనికి రానివ్వలేదు. దీంతో సభ్యులంతా బయట మండుటెండలోనే ఉన్నారు. ముందుగా తెలుగుదేశం, జనసేన ఎంపీటీసీ సభ్యులను వారి తరువాత వైఎస్సార్ సీపీ సభ్యులను సమావేశ మందిరంలోనికి పంపారు. వైఎస్సార్ సీపీ సభ్యులతోపాటు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కూడా వెళ్లారు.

కూటమి ఎంపీటీసీ సభ్యుల కుంటిసాకులు

సభ్యులంతా హాజరవ్వడంతో సమావేశం సజావుగా జరుగుతుందనుకుంటున్న సమయంలో తెలుగుదేశం, జనసేన ఎంపీటీసీ సభ్యులు లేచి మాకు నాలుగు రోజుల నుంచి కొత్త నెంబర్లు నుంచి వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఓటేయకపోతే మిమ్మల్ని బయట తిరగనివ్వమని, చంపేస్తామని బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. రాత్రి సమయంలో తలుపులు కొట్టి పారిపోతున్నారని హాస్యాస్పదరీతిలో కారణాలు చెప్పారు. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు మిమ్మల్ని బెదిరించిన వారిని గుర్తిస్తామని, మీకు స్వేచ్ఛ లేదు కనుక సమావేశాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు చెప్పి ఆయన సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తోపాటు, 13 మంది ఎంపీటీసీ సభ్యులు అదేంటి కోరం ఉన్నా కూడా ఎన్నిక ఏ విధంగా వాయిదా వేస్తారని అడుగుతున్నా ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు వారి మాటలు పట్టించుకోకుండా కిందకు వెళ్లిపోయారు. దీంతో 13 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుల తరపున ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కిందకు వెళ్లి ఎన్నికల అధికారిని కోరం అయినా సమావేశం ఎందుకు వాయిదా వేశారు? అని నిలదీయగా మౌనమే ఆయన సమాధానం అయ్యింది. సుమారు గంటన్నర సమయం వేచి చూసిన అధికారులు సమాధానం చెప్పకపోవడంతో 13 మంది ఎంపీటీసీ సభ్యులు గట్టిగా నిలదీయడంతో చివరకు ఎన్నికల అధికారి నలుగురు ఎంపీటీసీ సభ్యులకు బెదిరింపులు వచ్చినందువల్ల సమావేశం వాయిదా వేశామని, రేపు ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామని లిఖితపూర్వకంగా చెప్పడంతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు బయటకు వచ్చారు.

ఒక్క రోజులోనే రూ.27 లక్షల వసూళ్లు


పన్నులు చెల్లిస్తున్న వినియోగదారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పురపాలక సంఘంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించడంలో వినియోగదారులు వేగం పెంచారు. బుధవారం ఒక్క రోజులోనే రూ. 27 లక్షలు వసూళ్లు అయినట్లు మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ శివాజీ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ డిస్కౌంట్‌తో వినియోగదారులు పెద్ద ఎత్తున ఆస్తి పన్నులు చెల్లించడానికి ముందుకు వస్తున్నారన్నారు. పట్టణంలో మొత్తం 15085 అసెస్‌మెంట్‌లు ఉన్నాయని వీటి నిమిత్తం రూ. 8.27 కోట్లు ఆదాయం రావాల్సి ఉందన్నారు. బుధవారం నాటికి 71.78 శాతంతో రూ. 5.39 కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు. ఇంకా 2.88 కోట్లు వసూళ్లు అవ్వాల్సి ఉందన్నారు. అలాగే నీటి పన్ను బకాయిలు రూ. 3.03 కోట్లకు గాను ఇప్పటి వరకూ 52.20 శాతంతో రూ. 1.58 కోట్లు వసూళ్లు అయ్యిందన్నారు. ఇంకా రూ. 1.45 కోట్లు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. పాలకొల్లు మునిసిపాలిటీ ఆస్తిపన్ను వసూళ్లు మూడవ స్థానంలో ఉండగా నీటి పన్ను వసూళ్లలో మొదటి స్థానంలో ఉంది.

అమరుల త్యాగాలు మరువలేనివి

పాలకొల్లు సెంట్రల్: వర్గీకరణ కోసం మరణించిన అమరుల త్యాగాలు మరువలేనివని సనమండ ఎబినేజర్ అన్నారు. గురువారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆదేశాల మేరకు వర్గీకరణ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పసుపులేటి చినబాబు, పసల బోసు, పసుపులేటి నందబాబు, సవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఉప ఎన్నికలు


కడలి శ్రీనివాసరావు


పార్శి రాజబాబు

పాలకొల్లుసెంట్రల్: పాలకొల్లు మండలంలోని ఆగర్తిపాలెం, గోరింటాడ ఉప సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఉప సర్పంచ్ ఎంపిక రెండున్నర సంవత్సరాలకు ఒకరు చేసేలా నాడు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం గురువారం జరిగిన ఎన్నికల్లో ఆగర్తిపాలెం ఉప సర్పంచ్‌గా కడలి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఇతను టీడీపీ మద్దతుదారుడిగా ఉన్నారు. గోరింటాడ ఉప సర్పంచ్‌గా పార్శి రాజబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాజబాబు వైఎస్సార్ సీపీ మద్దతుదారుడిగా ఉన్నారు. కాని ఎన్నిక అనంతరం అన్ని పార్టీల నాయకులు వచ్చి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. పాలకొల్లు మండల టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో రాజబాబు కూడా టీడీపీ మద్దతుదారుడేనని ప్రచారం చేసుకున్నారు. దీనిపై రాజబాబును ప్రశ్నించగా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలతో సంబంధం ఉండదని నా ఎన్నికకు వైసిపి, టిడిపి, జనసేన పార్టీల నాయకులందరూ సహకరించి అభినందనలు తెలియజేశారని వారికందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పరంగా తాను మాత్రం వైఎస్సార్ సీపీ అభిమానినేనని ఏ పార్టీలోకి మారలేదని స్పష్టం చేశారు.

అబ్బిరాజుపాలెం ఉప సర్పంచ్‌గా డేవిడ్‌రాజు

యలమంచిలి: అబ్బిరాజుపాలెం ఉప సర్పంచ్‌గా రెండోవార్డు సభ్యుడు గోనమండ డేవిడ్‌రాజు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అబ్బిరాజుపాలెంలో మొత్తం 10 వార్డులకు గాను 2020లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్‌తోపాటు నలుగురు వార్డు సభ్యులు ఒక వర్గం నాయకులు విజయం సాధించారు. మరొక వర్గం తరపున ఆరుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. ఆ సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం మొదటి రెండున్నరేళ్లు ఉపసర్పంచ్‌గా ఉన్న కడలి ఏసుబాబు గడువు పూర్తయిన తరువాత తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రెండవ పర్యాయం గోనమండ డేవిడ్‌రాజును గురువారం ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్ ఎన్నిక పూర్తయిన అనంతరం డేవిడ్‌రాజుకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

మల్లవరంలో..

నరసాపురం రూరల్: మండలంలోని మల్లవరం గ్రామ ఉప సర్పంచ్‌గా పులఖండం ఆదివిష్ణుశేషు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఈవోపీఆర్డీ కె నాగేంద్రకుమార్ ఎన్నికల అధికారిగా జరిగిన ఈ ఎన్నికలో ఆదివిష్ణు ఒక్కరే పోటీలో ఉండటంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ఎన్నికల ధ్రువపత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఉప సర్పంచ్‌గా పనిచేస్తున్న యేలూరి సతీష్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగిన విషయం విదితమే.

పేదల ఇళ్లు కూల్చడం క్రూరత్వం


బొండాడ పంచాయతీ వద్ద నిరసన చేస్తున్న గోపాలన్

కాళ్ల: బొండాడలో పేదల ఇళ్లు కూల్చడం క్రూరత్వమని సీపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. మండలంలోని బొండాడ మెయిన్ రోడ్‌లోని పేదలు కూల్చిన ప్రదేశానికి గురువారం గోపాలన్ వెళ్లి పరిశీలించి పేదలతో మాట్లాడారు. అనంతరం బొండాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో బుల్డోజరు రాజకీయాలు పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో పేదల ఇల్లు కూల్చి సంపన్నులకి భూమిని దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇల్లు కూల్చిన పేదలకి వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతవరకు నివాస ప్రాంతంలోనే ఉండేలాగా అనుమతి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లను కోరారు. సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకష్ణ మాట్లాడుతూ ఇంత దారుణమైన పరిస్థితి మన రాష్ట్రంలో ఎక్కడా లేదని ప్రజలు తమకు అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని, చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

గుర్రపు డెక్కలో పోషకాలు మెండు


సిద్ధాపురంలో సూచనలిస్తున్న జేడీ జెడ్.వెంకటేశ్వర్లు

ఆకివీడు: పంట, మురుగు కాల్వల్లో విపరీతంగా పెరిగిపోయే గుర్రపుడెక్కను సద్వినియోగం చేసుకుని వర్మీ కంపోస్టు తయారీకి వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో వర్మీ కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్రపుడెక్క రైతులను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. పంట, మురుగు కాల్వలో వీటిని లక్షలు, కోట్లు ఖర్చుచేసి తొలగిస్తున్నా మళ్లీ, మళ్లీ వచ్చేస్తుందన్నారు. గట్లపై పారవేసిన ఫలితం ఉండటంలేదన్నారు. గుర్రపుడెక్కను వినియోగించి వర్మీ కంపోస్టు తయారుచేయాలని సూచించారు. వర్మీ కంపోస్టు తయారు చేసే కుండీల్లో పొరలు పొరలుగా పశువుల పేడ, వ్యర్థాలు, గుర్రపుడెక్క వేయాలన్నారు. దీనిపై డీ కంపోజర్స్‌ను వాడుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి కలియబెడుతూ ఉంటే గుర్రపుడెక్క కంపోస్టు తయారవుతోందన్నారు. ఈ పద్ధతిని సిద్ధాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలుజేస్తున్నట్లు వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఎంఏఓ ప్రియాంక, ఏపీఎం శేషవేణి తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల ప్రారంభం ఎప్పుడో?


నత్తారామేశ్వరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం


పాత పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

శిథిల భవనాల్లోనే సచివాలయం, హెల్త్ క్లినిక్ నిర్వహణ

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో సుమారు రూ.60 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, వైద్య ఆరోగ్యశాఖ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా భవనాల ప్రారంభోత్సవాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. నూతన భవనాలు పూర్తయినా ప్రారంభించకపోవడంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో గ్రామ సచివాలయంతో పాటు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని 1981లో గ్రామానికి చెందిన ప్రముఖ దాత పడాల వెంకటరెడ్డి నిర్మించి విద్యాశాఖకు అప్పగించారు. 1984లో మరో దాత ప్రవాస భారతీయుడు ద్వారంపూడి సుబ్బిరెడ్డి గ్రామ పంచాయతీ ఎదురుగా మరో భవనం నిర్మించి విద్యాశాఖకు అప్పగించడంతో ఈ రెండు భవనాలను గ్రామంలో పాఠశాలలకు వినియోగిస్తున్నారు. అయితే ఇటీవల పాఠశాలలో విద్యార్థుల తగ్గిపోవడం వెంకటరెడ్డి నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో సుబ్బిరెడ్డి నిర్మించిన భవనంలోనే పాఠశాలను కొనసాగిస్తున్నారు.



హెల్త్‌క్లినిక్ ప్రారంభించేందుకు వేసిన శిలాఫలకం

రూ.60 లక్షలతో నూతన భవనాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో హెల్త్ కేర్ క్లినిక్, గ్రామ సచివాలయలకు నూతన భవనాలు నిర్మించేందుకు రూ.60 లక్షల జాతీయ ఉపాధి పథకం కింద నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే గ్రామపంచాయతీ నిర్మాణంలో గ్రామానికి చెందిన ఏ వన్ కాంట్రాక్టర్ ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి మృమూర్తి ద్వారంపూడి సావిత్రమ్మ భాగస్వామ్య విరాళంతో సచివాలయ భవనాన్ని పూర్తి చేశారు. దీంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం కూడా పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గ్రామ సర్పంచ్ ఎలగల ధర్మారెడ్డి గ్రామ పంచాయతీ సభ్యుల ఆమోదం మేరకు ప్రోటోకాల్ ప్రకారం 28 డిసెంబర్ 2024 తేదీతో శిలాఫలకాలను కూడా ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. అయితే ఆ తేదీల్లో భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప దినాలు కావడంతో గ్రామ కూటమి నాయకులు వాయిదా వేశారు. అయితే ఈ ప్రారంభోత్సవాలకు కొందరు గ్రామ కూటమి నాయకులు అభ్యంతరాలు తెలపడంతో శిలాఫలకాలు వేసి మూడు నెలలు గడిచిపోతున్నా భవనాలు ప్రారంభోత్సవాలకు నోచుకోలేదు. దీంతో శిథిల భవనాల్లో సచివాలయ,, హెల్త్ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ తమ విధులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా నూతన భవనాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.